

"ఏయ్! ఎండపొడకు అంత బాగా నిద్రొస్తుందేమోయ్? లేచి, పంకా తాడు లాగు!" మధ్యాహ్నం భోజనానంతరం ఓ కునుకు తీద్దామని లోపల పడుకొంటే ఉక్కపోత భరించరానిదైంది వాసుదేవరావుగారికి. లేచి ఇవతలికి వచ్చారు.

వాకిట్లో గోడనీడలో తలరుమాలు పరుచుకుని పడుకొన్న నౌకరు కుర్రాడు, యజమాని అదిలింపు విని, కంగారుగా లేచివచ్చి నిద్రమబ్బు కళ్ళతోటే ఆదరాబాదరాగా తాడు పట్టుకొన్నాడు.

వరండాలో ఫలకమంచం మీద బాలీసు నానుకొని కూర్చున్నారు రావుగారు.

అక్కడే క్రింద ఈతచాప మీద గుమాస్తా వెంకటరమణ ఏవో లెక్కలు చూస్తున్నాడు, దస్త్రం విప్పి ముందు పెట్టుకొని.

మధ్యాహ్నం మూడు గంటలు దాటిందేమో? ఎండ మాత్రం అతి తీక్షణంగా ఉంది. ఎండలోకి చూస్తే కళ్లు చెదురుతున్నాయి. గాలిలో తేలిపోతున్న ఆవిర్లు కళ్ళకు మసకలు వేస్తున్నాయి.

"ఉశ్! అబ్బా! ఏం ఎండలు? ఇంకా ఇంత మండిపోయే ఎండలేమిటో? పెద్దపెద్ద బావులూ, చెరువులూ నీటితడి లేకుండా ఎండిపోతున్నాయి ఆషాఢం కూడా వెళ్ళిపోవచ్చింది. వానచుక్క లేదు...బ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పారు చూడు! భూమ్మీద జల అంతా ఇంకిపోయి జీవులంతా దాహం దాహం అని అరిచి చచ్చేరోజు వస్తుంటట! సొరకాయ బుర్రలో పోసుకొన్న నీళ్ళే గతి అట! ఆ రోజు దగ్గరికి వచ్చినట్లే ఉంది. ఏముంది, మరి? పాపం ఎక్కువైపోయింది భూమ్మీద! ప్రళయం పుట్టమంటే పుట్టదూ? సముద్రాలన్నీ ఏకమైపోయి భూమిని ముంచివేస్తాయట. అప్పుడు భక్తులైనవారు ఒత్తులై నిలుతురు – అన్నారు బ్రహ్మంగారు. కాలజ్ఞానంలో ఆ మహానుభావుడు చెప్పిన వింతలన్నీ ఒక్కొక్కటీ జరుగుతూనేఉన్నాయె! అయినా పాపాన్ని అరికట్టే నాథుడేడీ? స్వార్థమూ... సంకుచితమూ – దుర్మార్గమే మనిషి రూపు ఎత్తింది!"

ఇంటికేసి వస్తూన్న ఇంటి పురోహితుడు సూర్యనారాయణశాస్త్రి రావుగారి స్వగతం విని – 'నీ దగ్గర తీసుకొన్న వడ్డకు నాగుకు నాగు కట్టకపోతే ఒత్తివై నిలుస్తావులే! కాని ఇంత ధనపిపాస గలవాడివి! ఆ ఒత్తుల్లో తమరూ ఒక ఒత్తిగా నిలుస్తామని భ్రమ పడుతున్నారేమో? కల్ల!' అనుకొన్నాడు జుగుప్సగా.

వెంకటరమణ కాగితాలనుండి తలెత్తి "ఈసారి కాలం (పంట) ఎలా అవుతుందో? పుష్యమి కార్తెకూడా దాటిపోయింది. ఇంతవరకూ భూమిలో విత్తు పడలేదు. పేదలోకు లంతా గొడ్డూగోదా అమ్ముకొని వనవాసం వెళ్ళాల్సివస్తుందేమో?" అన్నాడు విచారంగా.

"ఎవరదీ? శాస్త్రి? రా, రా!"

కొంచెం దూరంలో వస్తూండగానే గొడుగు మడిచి, రావుగారికి నమస్కరించి, సమీపించాడు.

"ఇంత ఎండలో తప్పిపోయినట్లు వచ్చావేమిటయ్యా? పనేమిటి?"

తీక్షణమైన ఈ పరామర్శకు కొంచెం కలవరపడి, మంచం చెంతనే ఉన్న ఓ ఆసనంలో కూర్చొంటూ "పనిలేకుండా రావడం ఎప్పుడు జరుగుతుంది? పని ఉన్నది గనుకనే..." అన్నాడు శాస్త్రి

"చెప్పు!"

"ఒక ఏభై రూపాయలు..."

"ఇప్పుడు నా దగ్గర నగదుపైక మేమీలేదు."

"అలా తేల్చేస్తే ఎలా? చూడాలి— ఊరికే ఇస్తారా? నూటికి నాలుగు వడ్డీ తీసుకోనే తీసుకుంటారుగదా?"

"తీసుకొంటామయ్యా. తీసుకొంటాము! ఊరికే ఇస్తా రేమిటి? కాని, నా దగ్గర పైసా లేదిప్పుడు. సొమ్ములు పెట్టి తీసుకువెళ్ళేవాళ్లకే కాళీచేశాను. ఊరికే ఇచ్చే దెవడు?... ఈ కాలం ఎవరినీ నమ్మేట్లు లేదు. అసలుకే మోసం తెచ్చుకొనే తెలివి తక్కువ నా దగ్గర లేదులే."

"నా సంగతి మీకు తెలియదా? ఎప్పుడైనా ఎగ్గొట్టానా? ముందటేడు రెండుబస్తాలు నాగుకు ఇచ్చారు. పంటమీద రెండుబస్తాలు యిచ్చాను. బస్తా నాగుకు మళ్ళీ అరబస్తా నాగు కట్టారు. పంట సరిగా లేక బస్తా తెచ్చి పోశాను మీ ఇంట్లో. ఆ అరబస్తాకు నాగు కట్టారు! ఈ జన్మలో నా పొలం మీ నాగు పూర్తిగా తీర్చడానికి పంట మాత్రం యివ్వదు. ఈ జన్మంతా నాగుకు నాగు, నాగుకు నాగు కడుతూ పోవాల్సిందే ఉన్నట్లుంది!"

"తీసుకొన్నప్పుడు చేటెడుముఖం చేసుకొని ఎగుర్లాడతూ తీసుకొంటారు; ఇవ్వాలనుకొంటే పెద్దలు చచ్చినట్లు ఏడుపు. తీసుకొంటున్నప్పుడు గుర్తు ఉండదా— తిరిగి ఇంత ఇవ్వాల్సి వస్తుందని?" ఈసడించారు రావుగారు. ఇచ్చినవాడి క్రింద తీసుకొన్నవాడు లోకువే, మరి!


"మా బీద బ్రతుకులు చూస్తే మీబోటివాళ్ళకు హేళనే!" నొచ్చుకొన్నాడు శాస్త్రి. "అయినా ఏనాడూ మాట పోగొట్టుకోలేదు. తీసుకొన్న చోట ఎగనామం పెట్టే అలవాటులేదు. అయితే ముట్టించడానికి కాస్త ఆలస్యము కావచ్చు"

"నీతి నిజాయితీలను ప్రేమించని దెవరయ్యా? అవి మనిషిని ఆశ్రయించి ఉండడంకంటే పరిస్థితులను ఆశ్రయించడమే ఎక్కువకదా?" లోకజ్ఞానం ఒలకబోశారు. "సర్లే. ఆ నాగు అలాగే పెరిగిపోతున్నదా? మళ్ళీ అప్పుకు వచ్చావు! ఊళ్ళో మరెన్ని చోట్లో తాకట్లు! ఏ విధంగా తీరుస్తావో చెప్పు! నీ పౌరోహిత్యంవల్ల సంపాదించేది స్వల్పం. కూరగాయలకు చాలదు. ఆ ఎకరంన్నర పొలం పండితే పండుతుంది; పురుగులు తగిలితే గొడ్డుకు గడ్డికూడా రాకుండా పోతుంది. అసలు, ఈసారి వర్షాలేవు. పంట లెక్కడినుండి పండుతాయి? నా బాకీ ఎలా తీరుస్తావు? పంటలే లేవు—నన్నేం చెయ్యమంటావని మొండిచెయ్యి చూపితే నేను చేసే దేమి?"

'అమ్మో! నీ వసూలుచేసే పద్ధతి తెలియంది ఎవరికి? ఆయుష్యం నిండి








ప్రాణాలమీదికి వచ్చి కూర్చొన్న యముణ్ణి అయినా తప్పించుకోగల రేమోగాని, నీ అరబుజవాను వచ్చి గడపమీద కూర్చుంటే తప్పించుకోగల దొమ్మ లెవరికి?' అనుకున్నాడు శాస్త్రి.

మరికొద్దిసేపు ఇద్దరిమధ్యామాటలు నడిచాక, డబ్బు వడ్డీకి కాక, వడ్ల ఒప్పందానికి ఇవ్వడానికి అంగీకరించారు రావుగారు. బస్తా ఏభై రూపాయలు. ఈసారి వర్షాభావంవల్ల పంటలు తక్కువ కాబట్టి గింజ ధర ఇంకా ఎక్కువే పలుకడానికి అవకాశముంది. అంతకంటే దిగనన్నారు రావుగారు. ఈ పంటమీద ఇవ్వలేక పోయి మళ్ళీ పంటమీద అన్నాడంటే బస్తా వడ్లకు నాగు కట్టుకొంటాననని కాగితం వ్రాయించుకొని ఏభై రూపాయలు తెచ్చియిచ్చాడు లోపలినుండి.

డబ్బు ఉత్తరీయంలో కట్టుకొని లేచాడు శాస్త్రి. గొడుగు విచ్చుతూ అనుకొన్నాడు ... 'ప్రళయం పుట్టమంటే పుట్టమా? పాపం పెరిగిపోతూంది!'

* * *

ఇక్కడ రావుగారిని గురించి కొంత పరిచయం చేయాలి. మరీ పల్లెగాని, బస్తీగాని ఊరిలో ఎలమదొరల కుటుంబంలో ముగ్గు రన్నదమ్ముల్లో జ్యేష్ఠుడు ఈయన. మధ్యముడు పిచ్చి అవతారం. పిచ్చివేషానికి పిల్ల నెవరూ ఇవ్వలేదు. అతడి స్నాన భోజనాలన్నీ చూడడానికి ప్రత్యేకంగా ఒక మనిషిని పర్పాటు చేశారు రావుగారు. సాధారణంగా అతడిని గదిలోంచి బయటికి రానివ్వరు. కనిష్ఠుడు వేదాంతి. అతడికి భార్యా, ముగ్గురు పిల్లలూ ఉన్నారు. అంతా సమిష్టికుటుంబం. తోడి

కోడళ్ళమధ్య ఏనాడూ స్పర్ధలు, కలహాలు తలెత్తవు. చిన్నవాడు వేదాంతి అని చెప్పడం అయిందికదూ? ఆయన సహధర్మిణి కూడా ఇంటి విషయాలేవీ పట్టించుకోదు. భర్తవెంట పూజలకూ, పురాణకాలక్షేపాలకూ. వేదాంతగోష్ఠులకూ హాజరుకావడంలో కాలం గడిచిపోతూంది. పిల్లలను కనడంవరకే ఆమె వంతు అయ్యింది. తన ఆరుగురు పిల్లలకూ, తోడికోడలి ముగ్గురు పిల్లలకూ తల్లి అయి సాకిన పెద్దకోడలి సహనం, ఓర్పూ, శ్రద్ధా వర్ణన కసాధ్యం. తన చంటిపాప కాస్త ఎడబిడ్డ అవుతూనే చిన్నకోడలి సన్నకూన ఆమె ఒడి చేరేది.

తోడికోడళ్లు అక్కచెల్లెళ్ళలా, వాళ్ళ పిల్లలు ఒక తల్లిపిల్లల్లా ఉంటారంటే సరైనమాట కాదేమో? అక్కచెల్లెళ్ళయినా, ఒక తల్లిపిల్ల లయినా స్పర్ధలూ, ఈర్ష్యాసూయలకు లోనుగాకుండా ఉంటారని గట్టిగా చెప్పగలవారెవ్వరు? ఆ అనుబంధాన్ని మించిన అనుబంధ మేదో వారిని పెనవేసుకొని ఉంది. పెద్దకోడలు తన పిల్లలకంటే తోడికోడలి పిల్లలయందే ఒకింత పతపాతం చూపుతున్నట్లు అనిపిస్తుంది. అది సహజమేనేమో? తన పిల్లల నెలా చూచుకొన్నా ఒకరి విమర్శాదృష్టి పడుతుందన్న భయం ఉండదు. పరాయి పిల్లలు అలా కాదుకదా? మరైతే, చిన్నకోడలికి అటువంటి పట్టింపు లేంలేవు. ఉండే స్వభావమైతే తన పిల్లల ఆలనపాలన తను చూచుకోక మరొకరి మీద వదిలేదేకాదు. అయినా, పెద్ద కోడలి భయం పెద్దకోడలిదే. అయితే, ఆవిడ చిన్నకోడలి పిల్లలయందు చూపే ప్రేమా, శ్రద్ధాభిమానాలూ కృత్రిమమైనవంటే శుద్ధపొరపాటు.

బయటి వ్యవహారం చూచే అధికారం జేష్ఠుడి దయితే, ఇంట్లో పెత్తనం ఆయన భార్యది. ఇద్దరికీ ఊపిరి పీల్చుకోవడానికి కూడా తీరిక ఉండదు పనులతో, బాధ్యతలతో సతమతమౌతూ పెద్దవాళ్ళు అప్పుడప్పుడూ విసుక్కోవడం జరుగుతూంటుంది – ఏదీ పట్టించుకోకుండా ఆధ్యాత్మిక చింతనలో గడిపే చిన్నవారిని చూచి. అయితే, అది పైపైనే, తమ అధికార వాత్సల్యాల పరిధి నుండి తొలగిపోయి వేరే సంసారం సాగించగల వయస్సూ, అవకాశం ఉన్నా, తాము పెట్టింది తింటూ, తమయందు శ్రద్ధా, గౌరవం వ్యక్తపరిచే ఆ దంపతులంటే జ్యేష్ఠుడికీ, ఆయన భార్యకూ, ఒకవిధమైన సంతృప్తి, గర్వకారణమూ.

పోనీ, వారికి బాధ్యతలు తెలియజెప్పే సాహసము ఇంటి యజమానికి గానీ, ఆయన భార్యకూగానీ లేదు. చిన్నవయసునుండీ కనిష్టుడి మనస్సు





ఆధ్యాత్మిక చింతనవైపు మొగ్గుతూండడం అందరికీ తెలుసు. పెళ్ళి, సంసారాల యందు స్పష్టముగా విముఖత చూపాడు కూడా. కాని, అన్నగారూ, వదినగారూ బలవంతంగా పెళ్ళి చేశారు– పెళ్ళాం వస్తే – మనసు మారవచ్చునన్న ఆశతో. అయస్కాంతంలా భార్యమనసు మార్చి భక్తిపథంలోకి లాగుకొన్నారు ఆయన. వెలుగురేఖ చుట్టూ కాంతిలా భర్త సాహచర్యంలో ఒదిగిపోయిందామె. ముగ్గురు సంతానంవరకే వాళ్లు దాంపత్యం నెరిపారు. ఆ తరువాత స్నేహితులుగా కలిసిఉండడం – అందరికీ కాకపోయినా పెద్దకోడలికీ, ఆమె భర్తకూ తెలుసు.

తన ఇద్దరుబిడ్డల పెళ్ళిళ్ళతోపాటు, తమ్ముడి కూతురు కౌముది పెళ్ళికి కూడా రావుగారే పెత్తనం వహించారు. కౌముది పన్నెండేళ్ళ వయసులో అనుకోకుండా పెళ్ళి జరిగిపోయింది. రావుగారి చిన్నమ్మాయి పెళ్ళికి మగపెళ్ళివారి తరఫున వచ్చిన చుట్టాల్లో ఓ అబ్బాయి బాగా నచ్చాడు రావుగారికి. పెళ్ళిలోనే సంప్రదింపులూ వివాహనిశ్చయమూ జరిగిపోయాయి. పదిహేనురోజులు తిరగకుండానే మళ్ళీ పందిరి పడింది ఇంటిముందు. కౌముది వివాహం ఇరవయ్యేళ్ళ యువకుడితో జరిగింది.

మంచి మనసుతో చేసేపనులకు మంచిఫలితాలే ఎందరికి ప్రాప్తిస్తాయి. తన పిల్లలకంటే తమ్ముడిపిల్లకే అన్నివిధాలా యోగ్యమైన సంబంధం చేశానని మురిసిపోతున్న రావుగారికి తీరని కళంకం ప్రాప్తించింది– కౌముది భర్త కలరాకు గురిఅయి, ఆ పిల్ల పధ్నాలుగేళ్ళ జీవితంలోనే వైధవ్య భారాన్ని పొందడంతో!

కౌముది తల్లిదండ్రులు అదంతా జన్మగీతని ఒక నిట్టూర్పు విడిచి ఊరుకొన్నా, పెదనాన్నా పెద్దమ్మల మనసులుమాత్రం రగిలిపోయాయి.

మాటిమాటికీ పెద్దకోడలుసావిత్రి భర్తను సాధించేది: ‘పెద్దల పాపాలే పిల్లల్ని పీడిస్తాయి. మీరు చేసిన పనులు అభం శుభం తెలియని పసిదాన్ని సర్వనాశనం చేశాయి.’

“నే నేం చేశాను, సావిత్రీ?”

గుర్తు చేసింది ఆమె.

నిజమే ననిపించి పరితాపంలో క్రుంగిపోయారు ఆయన.

ఊరికంతటికీ షావుకారు రావుగారు. ఏవో సొమ్ములు పెట్టి డబ్బు తీసుకువెళ్ళేవాళ్ళు కాక పూటకు గతిలేని దరిద్రులు పుస్తెబొట్టు కుదువబెట్టి అయిదూ పదీ పట్టుకువెళ్ళేవాళ్ళు! రావుగారి వ్యాపారదృష్టిలో మాంగల్యాలు ఉంచుకోవడం మంచిదికాదని ఎప్పుడూ తోచలేదు!

మరొకసారి సమర్థించుకొనేవారు. 'తమ్ముడేమీ పట్టించుకోడా? ఇంత పెద్ద కుటుంబాన్ని పోషించవలసిన బాధ్యతా, ఈ పిల్లల భవిష్యత్తులు తీర్చిదిద్దవలసిన బాధ్యతా నా ఒక్కడి మీద ఉన్నది. కర్తవ్యనిష్ట కలవాడికి, బాధ్యతలు సక్రమంగా నిర్వహించే మనిషికి పాపపుణ్యాలు, ధర్మాధర్మ వివక్షత పెట్టుకొనికూర్చుంటే, మడి గట్టుకొని కూర్చొంటే, పని జరుగుతుందా? మాంగల్యాలు కుదువ ఉంచుకొన్నానని అపవాదేగాని, వారికి ఒక పూట అన్నం పెట్టిన దాతనే అయ్యాను కదా!'

ఆ లౌకికుడికి ధర్మాధర్మాలకు సక్రమమైన నిర్వచనం యివ్వగలవారెవ్వరు?

'స్వే స్వే కర్మణ్యభిరతస్సం సిద్ధిం లభతే నరః...' తరుచుగా అయన ఈ గీతాశ్లోకాన్ని పఠించేవారు – తన కర్తవ్యనిష్ట ఇంకా పటిష్ఠం కావడానికి.

* * *

ఆజానుబాహువు, స్ఫురద్రూపి అయిన ఒకయువకుడు ఎండకు మండిపోతున్న మాడుమీద తుండు ఒకటి వేసుకొని ఇంటివైపు వస్తూండడం చూశారు రావుగారు. పెద్దలు చెయ్యెత్తి ఆశీర్వదించే అతడిని – పిన్నలు చేతు లెత్తి మొక్కే అతడిని చూస్తే – రావుగారినిమాత్రం హేళనా తిరస్కారాలు చుట్టుముట్టుతాయి.


"ఏమిటయ్యా? అన్నదమ్ములు కూడబలుక్కొన్నారా? అన్నగారు అటు నిష్క్రమిస్తూనే తమ్ముడు ఇటు వేంచేశాడు?"

గొడుగుకూడా లేకుండా ఎండలో పడివచ్చి నీడలోకి చేరేప్పటికి కళ్ళను దివ్యమైన వెలుగు లేవో చుట్టుముట్టి ఎదుట ఏదీ స్పష్టపడకుండా పచ్చ పచ్చగా కనిపించింది అతడికి. క్రమంగా కళ్ళలో పచ్చదనం తొలగిపోయి యథార్థము గోచరించింది. "అన్నయ్య వచ్చాడా? ఏం పనిమీద వచ్చినట్లు?" నెమ్మదిగా ప్రశ్నించాడు.

"ఆ గృహస్థు పాట్లు నీ కెక్కడ పట్టాయి, బాబూ? నీ కెంత సేపూ ఎవ రెంత ఎక్కువ విరాళాలు ఇస్తారా, ఇం కెన్ని బళ్ళు నడుపనా అన్నధ్యాసే. 'ఇంటికి జ్యేష్ఠాదేవి, పొరుగుకు శ్రీమహాలక్ష్మి' అన్న సామెత ఉంది చూడు!" ఒక వ్యంగ్యహాసం విసిరారు.

"ఇంతకూ అన్నయ్య వచ్చినపని చెప్పలేదు." కొంచెం కలవరపడి అడిగాడు. ఇంతకుముందు అన్నగారు కూర్చొన్న ఆసనంలోనే కూర్చొన్నాడు అతడు. పలకమంచం కాక అక్కడున్న ఆసనం అదొక్కటే మరి. రావుగారికి సేదదీరుస్తున్న పంకాగాలి పక్షపాతం ఎరుగని ఆత్మీయురాలిలా అనంత్‌ను మెల్లిమెల్లిగా సోకి అతడి





ముఖాన పట్టిన స్వేదాన్ని ఆర్పివేస్తున్నది. 'పరవాలేదు. కలవారి ప్రాపు హాయిగానే ఉంటుంది స్మీ!' ఒక వెర్రి నవ్వు నవ్వుకొన్నాడు అతడు.

ఏదో మాట్లాడుతున్నారే గాని రావుగారి చూపులన్నీ అతడి చేతిలోని కాగితాలమీదే ఉన్నాయి. దేనికో విరాళం అర్థించడానికే వచ్చాడని చెప్పకనే గుర్తించారు. అదేదో తేలిపోతే తరువాత కులాసాగా మాట్లాడవచ్చు! "ముందు నువ్వొచ్చినపని చెప్పు, అనంతరామయ్యా!"

తనకుతూహలం ప్రస్తుతానికి అణచుకొని శ్రద్ధగా, స్థిమితంగా వివరించపూనుకొన్నాడు అనంత్: "మనిషికి అన్నవస్త్రాలకంటే ముఖ్యమైనవి విద్యావివేకా లన్న విషయం విజ్ఞులు ఒప్పుకొంటా రనుకొంటాను. అవి పొందడానికి పేదలు, ధనికులు అన్న భేద మేమీలేదు. కాని, పూటకు గతి లేని గర్భదరిద్రుడిని విద్యా వైజ్ఞానాలు వరించడం – ఆశ్రయించి ఉండడము అన్నది అరుదైన విషయం.

"అన్ని దానాల్లో విద్యాదానం

ఉత్తమమైనదిగా చెప్పబడుతుంది. ఇంతవరకూ రెండుపాఠశాలలు నెలకొల్పాను. ఒకటి విద్యావిహీనులైన శ్రామిక కార్మికులకు రాత్రివేళల్లో నడుపబడుతున్నది. రెండవది: బీద, అనాథబాలులకు.

"మొదటిది అనుకొన్న విధముగా సత్ఫలితాన్ని అందించినా, రెండవది కొనసాగేట్లు లేదు. పిలిచి 'ఓనమాలు దిద్దపెట్టిస్తాను రారా' అంటే, నేర్చుకోవాలన్న జిజ్ఞాస అంతో ఇంతో ప్రతి ఒక్కడికీ ఉన్నా, పరిస్థితులు, అందుకు అనుగుణంగా ఉండవు. ఓనమాలు దిద్దుకొని పుస్తకం పలకా చంకన ఇరికించుకొని హుషారుగా ఇంటికి పరిగెత్తే పసివాడికి ఆప్యాయంగా అన్నం తెచ్చి తినిపించే తల్లి ఉండదు కొందరికి: ఉన్నా పొయ్యిమీదికి కుండ ఎక్కించేస్థితి ఉండదు ఒకోఇంట్లో. చాలామంది పిల్లలు యాచనవల్ల, కాయకష్టంవల్ల, గొప్పవారింట్లో సేవకావృత్తివల్ల పొట్ట నింపుకొనే వారే. మండే కడుపులతో వారికి చదువుకొనే అవకాశం ఎక్కడ?

"ముందు పది, పదిహేనుమంది పిల్లలను ప్రోగుచేసి నడపడం సాగించిన బడిలో ఇప్పుడు ఒకరిద్దరు మాత్రం ఉన్నారు. కారణం ముందే చెప్పాను. ఇప్పుడు నేను గ్రహించింది, నిశ్చయించుకొన్నదీ ఏమిటంటే, వారికి ఒక ఆశ్రమం వంటిది కల్పించి, ఉచితంగా వారికి అన్నవస్త్రాలను ఏర్పాటు చేసి, కొన్ని నియమనిబంధనల్లో వారిని విద్యావంతుల్ని చేయడం బాగుంటుందని సంకల్పించాను. వారిని ఉత్తములుగా, ఆదర్శవంతులనుగా తీర్చిదిద్ది, సమాజకళ్యాణానికి అంకితం గావించాలని నా ఆశయం. ఇందుకు మీవంటి పెద్దలందరూ సహకరించాలండీ! మీకు తోచినంతవ..."

"ఏం? ఈ ముష్టివెధవల నందరినీ కూడదీసి ఉద్ధరించకపోతే, విద్యాపట్టం కట్టకపోతే సమాజం బాగుపడదంటావ్? ఇప్పుడు చెడిపోయిందేమి? వీళ్ళు వచ్చి ఉద్ధరించే దేమి?"

రావుగారు కుతర్కానికి దారి తీయడం చూచి కొంచెం చిరాకు పడ్డాడు అనంత్.

"బాగుపడడం మాట వదిలిపెట్టినా చెడిపోయే అవకాశం మాత్రం చాలా ఉంటుందండీ. కలుపుమొక్కలు అసలు పంటను పెరుగనీయక తమ వేళ్ళే బలంగా పాదుకొని రెపరెప లాడుతూ పెరిగినట్లుగా, ఒకరిద్దరు దుష్టులే సమాజ వాతావరణం కలుషితం కావడానికి కారణము కావచ్చు. ఆ ఒకరిద్దరు దుష్టులు తయారయ్యే అవకాశం ఎక్కువగా ఉండేది, తిండీ బట్టా కరువైన ఈ దరిద్ర వాతావరణంలోనే.



సంఘక్షేమానికి ప్రతి ఒక్కడికీ విద్య ఆవశ్యకత ఎంతయినా ఉంది."

"అక్షరజ్ఞానులందరూ సద్గుణ సంపన్నులైపోతే అడిగే దేముంది?"

"సకలసద్గుణ సంపన్నులౌతారని కాదు. విద్యావంతులు కొన్ని అవసరాలు తమంత తామే నెరవేర్చుకోగలరు. అజ్ఞానం మనిషి జీవితానికి ముప్పు అని మీరు ఒప్పుకొంటారా?"

"నన్నడిగితే నేను చెబుతాను చూడు! చదువుకోగల అర్హత కలవాళ్లే చదువుకోవాలి! లేకపోతే అర్థం కంటే అనర్థమే ఎక్కువ. పేడతట్టలు మోసేవాడికి చదువులా? పశువులు కాసేవాడికి చదువులా? చెప్పులు ముడిచేవాడికి చదువులా? ఇదెంత వెర్రి, బాపనయ్యా? ఏం? చాకలాడికి చదువొస్తే నాకంటే గొప్పవాడైపోతాడా? ఈ మిడిమిడి చదువులు చదివినవాళ్ళకి మిడిసిపా టెక్కువ. మొన్న ఏదో మాట అన్నానని పేడతట్ట నాముందర పడేసి, చేతులు కడుక్కొని, కొట్టంలో దాచుకొన్న పలకా బలపం పుచ్చుకొని అదే పరుగు ఆ రామిగాడు! వీళ్ళంతా చదువుకొనేవాళ్ళయితే పేడ ఎత్తుకోవలసిందీ, గొడ్లను కాచుకోవాల్సిందీ మేమేనా? పెద్దా చిన్నా రూపుమాసిపోవాలనేనా మీ ఆదర్శవాదు లందరి ఆశయం?"

"కేవలం చదువువల్లనే ఈ తారతమ్యం చక్కదిద్దబడుతుందని ఎవరూ అనరు. చదువుకొన్నంత మాత్రాన ఏ వృత్తివిద్యనూ చులకన చేయమని చెప్పడు విజ్ఞతకలవా డెవడైనా!" కొంచెం అలసినట్లుగా నిస్పృహగా అన్నాడు. ప్రతి ఇంటా ఇటువంటి వాదప్రతివాదాలే ఎదురుకావడం చూచి అతడిని ఏదో విరక్తి ఆవరించుకొంటున్నది. ఏవో ప్రశ్నలు, ఏవో విమర్శలు. వెక్కిరింపులు. ఎత్తిపొడుపులు!

"ఈ శూద్రవెధవలకి అక్షరజ్ఞానం కలిగించడమంతా వారిలో అవినయాన్నీ అహంకారాన్నీ రెచ్చగొట్టడమే నన్నమాట మరువకు! వంగి వంగి దండాలు పెట్టేకాల మేనాడో పోయింది. కనీసం స్తంభంలా నిలబడి చెయ్యి విసిరేవాడు కూడా లేకుండా పోతున్నాడు. ఈ వినయం ఎందువల్ల వచ్చిందంటావ్?"

'భగవంతుడా!' అనుకొన్నాడు అనంతరాయ్. 'ఎవరి గొప్ప, ఎవరి స్వార్థం వారు చూచుకొనే ప్రపంచ మిది!'

"కొత్తనీరు పాతనీరులో వచ్చి ప్రవేశించినప్పుడు కొంతఒండు రేగడం, అలజడి కలగడం సహజమేనండీ! మీ భావాలే మావికాదు. మా భావాలే మా పిల్లలవి కాబోవు. పరిణామం,

చైతన్యం సృష్టిసహజం. మా ఆశయాలు, ఆచరణలు మీకు నచ్చితీరాలని లేదు. మీ కోసం మా దారులు మార్చుకోవలసిన అవసరం లేదు. దేశ కాల పాత్రల ననుసరించి ఎన్నో మార్పులు అవసరం. పాతచింతకాయపచ్చడి వైద్యుడు పత్యకారిగా చెప్పొచ్చుగాని, అది అలాగే నిలువ వుంచుకోవలసింది కాదు. బూజుపట్టి పాడైపోతుంది. నవ్యత, నాగరీకత వ్యామోహంలో పూర్వపద్ధతులను, ఆచారాలను తృణీకరిస్తున్నానని అనుకోకండి. కొన్ని పరిస్థితుల్లో వాటిని అభిమానిస్తాను. అవసరాన్నిబట్టి కొన్ని సమయాల్లో తృణీకరించకా తప్పదు.

"కాని, ఏ పూర్వసంస్కారంకూడా కొందరు మాత్రమే ధనవంతులుగా, విద్యావివేక సంపన్నులుగా ఉండాలనీ, తక్కినవాళ్ళు వాళ్ళ క్రింద తొత్తులుగా పడివుండాలని - అదే పెద్దా చిన్నా తారతమ్యమనీ, అదే వినయమనీ, సుగుణమనీ చెప్పదుకదా ?"

"దేశాలు పట్టిపోయి మాటలు బాగా నేర్చావులే!" బుంగమీసాల మధ్యనుండి ఒక మందహాసం విసిరారు రావుగారు. అయితే అది నిష్కల్మషమైన నవ్వు అని చెప్పడానికి వీల్లేదు. నా కళ్ళముందు పుట్టి పెరిగినవాడు, నాకే నీతులు చెప్పడం నేర్చాడే అని ఎంతయినా తన్నుకొని ఉంటారు లోలోపల!

"మీకు తోచిన దేదో ఇచ్చి పంపండి!" కణతలు ఒత్తుకొంటూ అన్నాడు. వెలుపల ఎండలోకి చూపులు సారించాడు కళ్ళు చిట్లిస్తూ. గాలి బొత్తిగా లేదు. ఆకు అల్లాడడం లేదు. వాకిట్లో విశాలంగా పరుచుకొన్న వేపచెట్టు కొమ్మల్లో ఎండతాపానికి కొట్టుకొంటున్న గుండెలతో నోళ్ళు విచ్చి కీచ్‌కీచ్ మంటున్నాయి ఊర పిచ్చుకలు.

రావుగారు ముఖమంతా ఎలాగో చేసుకొని అన్నారు: "నీ జన్మే బిచ్చంతోజరిగింది. అనంతరామశాస్త్రి! మీ అమ్మకు నొప్పు లెత్తుతూంటే మీ నాన్న మాఇంటికి పరిగెత్తుకొచ్చాడు- మా ఆవిడ కంటూంది; పురుటి ఖర్చులకు ఓ పదిరూపాయయి దయచేయించండి-అంటూ. పురుటిలోనే తల్లిని మింగావా? ఆ అమ్మ నడిగి, ఈ అమ్మ నడిగి 'గుక్కెడు పాలు పట్టిపొండి సన్నకూనకు' అని కాళ్ళావేళ్ళా పడేవాడు మీ అయ్య! ఆ తల్లుల పుణ్యమా అని బ్రతికి బట్టకట్టావు. ఆ తరువాత బిచ్చమెత్తి ఎత్తి మీ అన్నదమ్ముల సాకలేక, ఓనాడు ఇంట్లో దూలానికి ఉరిపోసుకు చచ్చాడా బ్రాహ్మడు !

"ఏ ధర్మదాతల పుణ్యమో-డిగ్రీల మీద డిగ్రీలు తీసుకొని వచ్చావు




కాని, ఏం లాభం? వంశ పారంపర్యమని చెబుతారు చూడు! తండ్రిగారి భిక్షాటన కొడుక్కు సంప్రాప్తించినట్లుంది! అస్తమానం ఇంటింటికీ చందాలూ, విరాళాలూ అంటూ తిరుగుతున్నావు!"

వెలవెలబోయాడు అనంత్.

"భిక్షాటనా?"

"అంతేమరి."

"పెద్దలు! భిక్షాటన అన్నారు! కాదనడం దేనికి? అలాగే అనుకొందాం." మందహాసంతో దృఢంగా, గంభీరంగా అన్నాడు అనంత్: "ఇది నాకోసమైతే ఎంతయినా అసహ్యించుకొనేవాడినేమో? ఈ జీవితం చూచి సిగ్గుతో చితికిపోవాల్సివచ్చేదేమో ? కాని, ఇది నాకోసం కాదు. అనాధులైన నలుగురు పిల్లలకు సౌభాగ్యవంతమైన భవిష్యత్తుకోసం బిచ్చమెత్తుతున్నాను. ఇందులో నేను సిగ్గుపొందాల్సిందీ, అవమానంగా భావించి క్రుంగిపోవాల్సింది ఏమీ లేదు!"

"నీ కెలా కావడంలేదో గాని, నీ వ్యవహారం చూస్తుంటే నాకు సిగ్గేస్తున్నదయ్యా! తోడబుట్టినవాడా? మరొకడా? అతడి అవస్థేమిటి? కథ ఏమిటి? ఊరినిండా ఎన్ని అప్పులు? ఎన్ని తాకట్లు? అన్న అవస్థ పట్ట లేదుగాని ఊరి ఆపదలకు మాత్రం ఆపద్బాంధవుడివి! సేవలు! చందాలు!! బడులు!!! చివరికి ఆ పెళ్ళాం పిల్లలను సాకలేక ఈ తాకట్లనుండి తప్పుకోలేక మీ తండ్రి చేసిపోయిన పని చేసిపోయాడంటే, చెట్టంత తమ్ముడివి ఉండి - శాస్త్రికి ఆ గతి పట్టిందంటే - నిన్ను ఊరూ వాడా వేనోళ్ళ కీర్తిస్తుంది!"

"అన్నయ్యకు అప్పులా? నాకు తెలియకుండా ఉన్న అప్పు లేమిటి? ఎవరు మీతో చెప్పింది?" నమ్మలేనట్లుగా అన్నా, నమ్మక తప్పని పరిస్థితి వస్తుందేమోనని భయపడుతూనే అడిగాడు అనంతరామ్.

"వెంకటరమణయ్యా! ఆ నోటు బుక్కు యిలా తెచ్చి చూపవయ్యా!" హుందాగా ఆజ్ఞాపించారు రావుగారు.

అనంత్ ముఖం వివర్ణమైంది. హఠాత్తుగా అగాధ మేదో ముందు ప్రత్యక్షమై తను అందులో పడిపోతున్నట్లుగా అనిపించింది. 'అన్న అప్పులు నావి కావా? ఆయన కష్టసుఖాలు నావి కావా? ఇన్ని అప్పులు చేసి అన్నయ్య తెస్తూంటే ఏ వేళప్పుడు నేను ఇంటికి వచ్చినా విస్తరినిండా తోడి నవ్వుతూ కబుర్లాడేది వదిన! నా ముందు లేమిని దాచుకోవడానికి నే నేమైనా పరాయివాడినా? ఇంటివాడి ముందే లేనిపోని అభిమానమా? నాకు పెట్టి వదినా, పిల్లలూ తినేవాళ్ళో, కాదో? భగవాన్! నా నైచ్యాన్ని క్షమించు! ఒక్కనాడూ వీళ్ళ కష్టసుఖాలు పరామర్శించలేక

పోయాను!' సిగ్గువల్ల, బాధవల్ల అతడి కళ్ళు చెమ్మగిల్లాయి. నోటు బుక్కు తీసుకొని చూస్తుంటే చేతులు వణికాయి.

"బంగారుగొలుసు ఎన్ని తులాలు ఉంటుంది?... పెట్టి అయిదేళ్ళు దాటి పోతున్నట్లుంది. వడ్డీ అసలును మింగే సింది. ఓహ్!" నిట్టూర్చాడు అనంత్. "ఇంత డబ్బు కట్టి ఈ గొలుసును విడి పించుకొనేది ఎప్పుడట?''

వెంకటరమణ చెప్పాడు: ''రెండు మూడేళ్ళదాకా గొలుసు సంగతి గుర్తున్నట్లుంది శాస్త్రిగారికి. ఈసారి పంట బాగుంటే గొలుసు విడిపించుకు పోతా ననేవాడు. తరువాత మరిచి పోయినట్లే లెక్క. ఎందుకంటే ఈమధ్య ఎన్నడూ గొలుసువిషయమే ఎత్తుకోలేదు పెరిగిపోతున్న అప్పులకు తోడు ఈ గొలుసును కూడా ఎక్కడ విడిపించుకోగలడు? అసలుకు వడ్డీ సమానమైపోయె!''

''పూర్తిగా లెక్కకట్టి చెప్పండి, మొత్తం!"

అనంత్ డబ్బు కట్టి గొలుసూ, రసీదూ తీసుకొన్నాడు. 'అదృష్ట దుర దృష్ట దేవతలు నిరంతరం జూద మాడు తున్నాయి ఈ ప్రపంచంలో. ఒకరి జయము మరొకరి ఓటమి! దరిద్ర దేవతవల్ల కూలిన పది ఇళ్ళమీద అదృష్టదేవత ప్రాపు పొందిన ఒకరి మేడ లేస్తుంది!'

"మాసం గడువులో మీ బాకీ గీకీ ఏమున్నా తీర్చివేయడానికి ప్రయత్ని స్తాను!"

''ఏమో అనుకొన్నాను. గట్టి వాడివే! అయినా, ఇంత డబ్బు ఎక్క డిదో? నీది కాదనుకొంటాను. ఎందు కంటే, పైసా సంపాదన లేని నిరు ద్యోగివి కదా?"

రావుగారి వంక చురుకుగా, కరు కుగా చూశాడు. "ఎక్కడా దొంగి లించి తెచ్చిన డబ్బుకాదులెండి!"

"కాని, బీదవిద్యార్థులకోసం చందా ఎత్తిన డబ్బును ఇలా నీకై వాడు కోవడం అంతకంటే నీచమైన దవు తుందేమో?''

కొరడా చురక తగిలినట్లు ఉలిక్కి పడ్డాడు అనంత్. 'ఓహ్! నేను ఎంత ఆవేశపడ్డాను? పరుగెత్తుకు వెళ్ళి వదిన చేతిలో గొలుసు పెట్టి సంతృప్తిగా నిట్టూర్పు విడువా లనుకొన్నాను. కాని, కాని...ఇంత నైచ్యం జరిగాక ...ఇంకా నేను సంతృప్తిగా ఉండడం ...ఓహ్! ప్రథమంగా జీవితంలో నేను ఎదురుదెబ్బ తిన్నానా?' ఎన్నడూ కనిపించని వెలితి ఏదో మనసులో కనిపించింది. ఆందోళనను, ఆత్మగ్లానిని మనసులోనే అణచుకొని, పైకి నిబ్బరం తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు.





కాని ఏదో దిగులు మనసునూ, ముఖాన్నీ ఆవరించుకుంది.

"వస్తాను." లేచాడు అనంత్. ఏనాడూ వచ్చినపని సాధించకుండా కదిలినవాడు కాదు. చందా వసూలు చేసితీరే హక్కు తనకు ఉన్న దన్న ట్లుగా ఖండితంగా అడిగి పుచ్చుకొనే వాడు. కాని, ఈనాడు ఆ సాహసం, నోరూ ఎక్కడిది?

'ఎంత ఉన్నతి సాధించినా మనిషిని ఒక్క క్షణంలో క్షుద్రుడిగా మార్చి వేసే మహత్తరశక్తి దారిద్ర్యంలో ఉన్నదా?'

జవసత్వాలు ఉడిగిన వృద్ధుడివలె, నెత్తిమీద ఏవో పర్వతా లున్నట్లు భారంగా, నీరసంగా వరండామెట్లు దిగి రెండడుగులు వేసి ఆగి, వెనుదిరి గాడు, రావుగారి చిన్నకొడుకు హార గోపాల్ పిలుపు విని. "అనంతయ్యా! మరే హారన్నయ్య పిలుస్తున్నాడు!"

''మళ్ళీ వస్తానని చెప్పు!''

"అనంత్‌బాబూ! ఇంట్లోకి వచ్చి పొండి, ఒక్కమాట!'' రావుగారి కుమారుడే హారనాథ్ గబగబా యివ తలికి వచ్చాడు.

నిజంగా, ఇప్పుడు ఎవరినీ కలువాలని లేదు అనంత్‌కు. హరనాథ్ వెనుక ఇంట్లోకి వచ్చాడు.

విశాలమైన ఒక హాలులో కిటికీ ప్రక్క ముగ్గురువ్యక్తులు కేరమ్సుబల్ల పైన పేకముక్క లాడుతున్నారు. అందులో రావుగారి తమ్ముడికూతురు కౌముది ఉంది. కౌముది పరిచయం ఇంతకుముందు జరిగింది అనంత్‌కు. ఏదో సందర్భంలో ఒక నూతన యువకుడుకూడా పేకాటలో ఉన్నాడు

"ఈయన మా అమ్మగారి తమ్ముడు నళినీమోహన్. లాయర్ పట్టా తీసుకొని ప్రాక్టీసు పెట్టబోతున్నాడు. సరదాగా ఓ నాలుగురోజులు ఇక్కడ గడిపిపోదామని వచ్చాడు!"

"నిజం! చాలా సరదాగా గడిచాయి ఈ నాలుగురోజులూ!" కౌముది వంక అదోలా చూస్తూ నవ్వాడు నళినీ.

హరనాథ్‌వల్ల అతడి పరిచయం జరిగాక "నమస్కారమండీ!" అన్నాడు అనంత్, మరో కుర్చీలో కూర్చొంటూ.


"ఈయన అనంతరామశాస్త్రి. మన ఇంటి పురోహితులవారి తమ్ముడు– ఎమ్. ఏ. మరేదో డిగ్రీకూడా ఉన్నట్లు విన్నాను."

"ఐసీ!" ఆశ్చర్యంగా చూశాడు నళినీ. "ఎవరో వీధిబడి పెట్టుకొన్న పంతులయ్య అనుకొన్నాను స్మీ! ఇందాక ఈయన చందాలు ప్రోగుచేసి ముష్టి వెధవలకోసం ఆశ్రమ నిర్మాణాలూ, విద్యాసంస్థలూ పెట్టాలని చూస్తున్నాడని విని. లక్షణంగా ఎమ్. ఏ డిగ్రీ తీసుకొని ఇదేం నిర్వాకం? ఛఛ! చాలాసిగ్గు! ఆ ముష్టి వెధవలకోసం ప్రాకులాడితే చివరికి మీరు ముష్టెత్తవలసివస్తుందేమో!"

అంతటితో అతడి స్వభావ పరిచయం కూడా అయినట్లనిపించింది అనంత్‌కు. 'మీవంటివారితో ఒక ఉత్తమ లక్ష్యంపై తర్కవితర్కాలు జరపడమే సిగ్గు!' అనుకొని మరి మాట కలపలేదు అనంత్.

నళినీది ఊరకుండే స్వభావం కానట్లుంది. 'కనకపు సింహాసనముమీద శునకమును గూర్చుండబెట్టిన'- అని ఎవరో శతకకర్త చెప్పాడు చూడండీ! ఈ మాలమాదుగులకు చదువులు వస్తాయా? ఓనమాలు దిద్దడానికి వచ్చినా, పండితులు కాగల అర్హత వాళ్ళు ఎన్ని జన్మలు తపస్సు చేస్తే వచ్చేది? పూర్వజన్మ సంస్కారం కావాలి. వాళ్ళసంస్కారం బాగాలేకే ఈ ముష్టిజన్మ లెత్తడం. చూచి చూచి ఏ దరిద్రక్షణంలో ఈ దరిద్రపు ముఖాల బాగుకోసం పాటుపడాలని కంకణం కట్టుకొన్నారండీ? ప్చ్! నిండు జీవితం నిరర్థక పర్చుకొంటున్నారు. మీ లక్ష్యశుద్ధి ఎంత బలమైనదైనా వాళ్ళ జన్మగీతలను మారుస్తాయని నమ్మకం గలుగడం లేదు. వాళ్ళ కర్మలకు వాళ్ళను..."





"నాదీ ఒకనాడు ముష్టిజన్మే నని మీకు తెలియదేమో?" ఒక శుష్క హాసం చేశాడు అనంత్. "మనకు కావలసింది ఇటువంటి శుష్కవేదాంతం కాదు. 'ఒకడు నిండు ప్రవాహంలో కొట్టుకుపోతుంటే-నాయనా, చివరి ఘడియల్లో నారాయణ, నారాయణ అని స్మరించుకో - అని చెప్పడం కాదు; కొట్టుకుపోతున్నవాడికి చేతి నందించు ధైర్యంగా' అంటాడు వివేకానంద! జీవిత సార్థక్యం ఎందులో ఉంటుందో తెలియనివారికి ఒక లక్ష్యసాధనలో నిండుజీవితం నిరర్థకమౌతున్నదని చెప్పే అధికారం లేదు." ఇంచుక కటువుదనంమిళితమైంది, మందస్వరాన చెబుతూన్న అతడి మాటల్లో.

ఇంతసేపూ మౌనంగా అనంత్‌కు చెంపజేసి కూర్చున్న కౌముది ఇటు తల తిప్పి తెల్లని పలువరస కనిపించేలా సున్నితమైన మందహాసం వెలువరించింది. ఇదివరలో నిర్లిప్తంగా, నిర్వికారంగా ఉండే ఆమె చూపులు ప్రశంసాపూర్వకంగా మారడం గుర్తించిన

అనంత్‌కు అనిర్వచనీయమైన తృప్తి ఏదో కలిగింది.

"నిన్న పేపర్లో ఎమ్.ఏ. ఫలితాలు వచ్చాయి కదూ?" అనంత్ పలుకరించాడు.

"ఆఁ."

హరనాద్ గొప్పగా చెప్పాడు: "కౌముది క్లాసుతో పాసైంది."

"అందుకే, పార్టీ ఇమ్మంటే... అమ్మో! మహాపిసినారి ఈ కౌముది!" వికవిక నవ్వాడు నళినీ.

"మీ అభిమానవిషయ మేది ఎమ్.ఏ.లో?" కుతూహలంగా ప్రశ్నించాడు అనంత్.

"ఫిలాసఫీ."

"ఓహ్! వేదాంతం మీ అభిమాన పాత్ర మన్నమాట!"

"అభిమాన పాత్రమైనా, కాకపోయినా అవసరం మాత్రం ఉంది నాకు!" అని ముఖం తిప్పుకొన్నది కౌముది.

"ఉఁ."అనంత్ బరువైన ఒక నిట్టూర్పును లోపలే అణుచుకొన్నాడు.

"పెద్దనాన్న దగ్గరికి వచ్చినట్లున్నారు— చందాకోసం. ఇచ్చారా?" హరనాధ్ అడిగాడు.

"ఊహూఁ."

"అరే! నియమభంగమైనట్లుందే? ఇవ్వందే మీరు కదిలేవారుకాదుకదా?"

"కదలవలసివచ్చింది;" ఒక తత్తరపాటును లోపలే అదిమిపెట్ట ప్రయత్నించాడు అనంత్. తన ధైర్యాన్ని సడలింపజేసిన సంఘటన ఎంత దురదృష్టకరమైనది? భగవాన్! ఇహ జీవితమంతా అంతర్యానికి ముసుగు వేసి మరో ముఖం పెట్టుకొని లోకుల ముందు నటించవలసివస్తుందా?

హరనాధ్ కుతూహలంగా అడిగాడు: "మీ ఆశయోద్దేశ్యాలగురించి, వాటి ఆచరణా పథకాలగురించి, తెలుసుకోవాలన్న ఆసక్తి కుతూహలాలు కౌముదికి కలిగాయి. అనంత్‌బాబు కలిస్తే ఆయనను అడిగి తెలుసుకోవాలని ఉందని ఒక రోజు అందామె."

"ఆమెకూడా అందరివలె నాది పిచ్చిపనులని కొట్టిపారేయలేదు, ధన్యవాదాలు!" కృతజ్ఞతా భరితమైన చూపులు కౌముదివంక సారించాడు. "అలాగే. ఒకనాడు బాగా తీరిక చేసుకొని వస్తాను. ఆమెకు కావలసిన వన్నీ చెబుతాను. ఇప్పుడు ఎంతోసేపు కూర్చోవడానికి వీల్లేదు. అవసరమైన పనులు ఉన్నాయి; వస్తాను;" లేచాడు అనంత్. అందరివద్దా సెలవు పుచ్చుకొని కదిలాడు.

వెనకమాటలు వినిపించలేదుగాని పెద్దపెట్టున నవ్వొకటి చెవులు బద్దలు కొడుతున్నట్లు వినబడింది. హేళన ధ్వనించే నళినీ వికృతహాసం! తన వెనుక ఇటువంటి నవ్వు లెన్నో విన్నాడు అనంత్. విని ఏనాడూ ఏవిధంగా చలించలేదు. తననిజాయితీ అందుకు కారణం. ఈనాడు తద్విరుద్ధంగా మనసు వ్యాకులతకు లోనయింది. తను అనాలోచితంగా తన ఆదర్శాలకు విరుద్ధంగా చేసినపని మనసును ముల్లువలె గుచ్చి గుచ్చి బాధిస్తున్నది. ఎవరిముందూ తలవంచి ఎరుగని తనను తలవంచేలాగు చేస్తున్నది, ఆ నీచకృత్యం!

* * *

సంధ్యపడుతూంటే మడిబట్ట చుట్టుకొని, కుంపటిమీద అన్నానికి ఎసరు వేసి, పెరుమాళ్ళ దీపారాధన చేసి, అన్నం దించేస్తూనే, మరిది భోజనానికి యింకా రావడం లేదేమా అని గది ముందుకు వచ్చింది సరస్వతి. "ఏ ఊరు కాలిందయ్యా! మరిది లక్ష్మణా! సాయంత్రమప్పటినుండి ఇంట్లోనే ఉన్నావు? పనేమీ లేదా? నువ్వు వచ్చినప్పటినుండీ క్షణం తీరికగా, స్థిమితంగా ఇంట్లో నిలువగా చూశామా? ఈ రోజు ఏమిటి ఈ విడ్డూరం?" ప్రపంచంలోని నైర్మల్యమంతా తన సొమ్మే నన్నట్లు తేటగా నవ్వుతూ గదిలోకి వచ్చింది. "ఏడున్నర అవుతున్నది కదూ? భోజనానికి లేవవా? నీ బాలశిష్యులు వచ్చి కూర్చొన్నారేమో?" నవ్వి, మరిది మ్లానవదనం చూచి గతుక్కుమని, "కోపం వచ్చిందా బాలశిష్యులని అన్నందుకు? శిష్యుడు పండుముదుసలి అయినా పసివాడితో సమానమే గురువుకు—ఏం? నవ్వులాటకు అన్నానేగాని మరోవిధంగా నొచ్చుకో కేం?" అన్నది అనునయంగా. "ఇవాళ భోజనానికి తొందరపడడం లేదేం? నిన్న మొన్న ఎక్కడినుండో ఊడిపడి, 'వదినా, అన్నం పెట్టు, పద' అని తొందర పెట్టేసినవాడివే? ఇదేం వాలకం ఈవేళ? ఏమైనా జరిగిందా? ఒంట్లో బాగుండలేదా?"

వదినగారి ఆత్మీయతకు, ఆవిడ చూపుతున్న ఆత్రుతకు అనంత్ కళ్ళు తడిశాయి. కన్నీళ్ళు ఆమె చూడకుండా ముఖం తిప్పుకొని, అతి ప్రయత్నంతో గొంతు పెగల్చుకొని "మరి, పెట్టు—పద, వదినా! వస్తా," నన్నాడు వీలైనంతవరకు గొంతు సరళంగా మార్చుకొని.

కాళ్ళు కడుక్కొనివచ్చి వంటింట్లో వదినవాల్చిన పీటమీద కూర్చొన్నాడు అనంత్. అప్పుడు సెగనుండి తీసిన అన్నం విస్తట్లోకి తోడుతూంటే పొగలు పైకిలేస్తున్నాయి. విస్తరినిండా అన్నం తోడింది స్టాంబాణంలోంచి. "కూర్చో."

విస్తరిచుట్టూ నీళ్లు మాత్రం చుట్టి కూర్చొన్నాడు అనంత్, అన్నం మాత్రం కలుపకుండా.

"అదేమిటి? అలా కూర్చుండిపోయావ్?''

''ఆ గుండీలో ఒక్కరికి సరిపడ అన్నం ఉందేమో? మీ అందరికీ అదేనా?

''అంత నాజూకు తిళ్ళేం తినం, బాబూ! పొద్దుటి అన్నం చరివిలో ఉంది. పిల్లలూ, నేనూ పెట్టుకొంటాం; ఇది మీ అన్నయ్యకు పెట్టేస్తాను. ఎన్నడూ యిలా అడిగేవాడివి కాదే? ఇవాళ అంతా వింతగా ఉంది నీ ప్రవర్తన. ఏం జరిగిందంటే చెప్పవు కదయ్యా, రామయ్యా!"

'అడగక అడగక ఈవేళ అడిగాను! అన్నయ్య ఈవేళే వడ్ల ఒప్పందానికి ఏభై రూపాయలు పట్టుకొచ్చాడు కదా, వదినా! బ్రతికిపోయావ్, నాటకం బయటపడకుండా!' అనుకొన్నాడు లోపల్లోపల, కోపంగా.

సరస్వతి నేతిగిన్నె పట్టుకు నిలబడింది. "కలుపవేం, రామూ? అన్నం ముందు కూర్చొని ఆ తపస్సేమిటి, మనసు అంతర్ముఖం చేసి?"


తలెత్తి వదిన ముఖంలోకి చూశాడు అనంత్, నిదానంగా. ఒక నిట్టూర్పు విడిచి, "నిన్న మొన్న వచ్చిన మరిదికి ఈ విషయాలన్నీ ఎందుకు తెలియనివ్వాల-అతడి మనసెందుకు కష్టపెట్టాలని దాచారు మీ రిద్దరూ! సరే కాని, ఈ దౌర్భాగ్యుడు ఏ విధానా బయటపడలేని పాపకూపాన పడిపోతున్నాడని మీకేనాడూ తట్టలేదా, వదినా!" అని అడిగాడు. "మీది సద్భావమే కావచ్చు; కాని, అది నాకు పాపాన్నీ, కళంకాన్నీ మూటగట్టి ఇస్తున్నది."

వెలవెలబోయింది సరస్వతి. అతడు ఏది మనసులో పెట్టుకొని యిలా నిష్ఠూరమాడుతున్నాడో చప్పున బోధపడలేదామెకు. "దేన్ని గురించి ఈ నిష్ఠూరాలు?" అంది ఖిన్నవదనంతో.

"ఇంటికి రాగానే విస్తరినిండా కుంభం తోడేదానివి, ఏనాడూ మీకు ఉన్నదో లేదో నన్న ఆలోచనకూడా నాకు రాకుండా నేర్పుగా నాటకమాడావు! ఎన్నిసార్లు నాకు పెట్టి నువ్వూ, పిల్లలూ ఉపోషాలు ఉన్నారో దైవానికే తెలియాలి, మరి! ఉన్న సొమ్ములేవో కుదువబెట్టారని, అన్నయ్య అప్పులు చేసి, అప్పులు పుట్టనిచోట కొంపలు ముంచే వడ్డీలకూ, వడ్ల ఒప్పందాలకూ తెచ్చి ఇల్లు నడుపుతున్నాడని ఏనాడైనా నాకు తెలియనిచ్చారా? ఓహ్! ఇద్దరూ ఎంత నేర్పరులు? ఎంత నటకులు?"

ఒక్కక్షణం పట్టుపడిన దొంగలా తలవాల్చింది సరస్వతి. వెంటనే ముఖభంగిమలు మార్చి, లేనినవ్వు తెచ్చుకొని ఊరికే నవ్వేస్తూ, "భలేవాడివే! నాటకాలు బూటకాలు ఎందుకు వచ్చాయి? డబ్బు పుష్కలంగా చేతిలో ఆడుతుందని చెప్పనుగాని. ఏనాడూ నీకు పెట్టి మేము ఉపవాసాలు చేసినరోజు రాలేదు. నేతిగిన్నె పట్టుకొని చెబుతున్నాను!" అంది.





నవ్వొచ్చింది అనంత్‌కు. "నేతిగిన్నె సాక్ష్యం ఎందుకు వచ్చిందిలే, వదినా! నీ మాట అబద్ధమైనా ఆ గిన్నె క్రిందపడి నీ నేరం బయటపెట్టదు; ఆ సత్యకాలాలు పోయాయి."

మౌనంగా భోజనం కానిచ్చి వెళ్ళిపోయాడు అనంత్.

పిల్లలకు అన్నాలు పెట్టేస్తూంటే వచ్చాడు శాస్త్రి. అతడికీ అన్నం పెట్టి అతడిభోజన మయ్యాక తనూ తిని, మడిబట్ట వదిలి, మామూలు చీర కట్టుకొని యివతలికి వచ్చింది సరస్వతి. తాంబూలం వేసుకొంటూంటే చిన్న కొడుకు వచ్చి చెప్పాడు: "బాబాయ్

"అదేమిటి? అలా కూర్చుండిపోయావ్?''

''ఆ గుండీలో ఒక్కరికి సరిపడ అన్నం ఉందేమో? మీ అందరికీ అదేనా?

''అంత నాజూకు తిళ్ళేం తినం, బాబూ! పొద్దుటి అన్నం చరివిలో ఉంది. పిల్లలూ, నేనూ పెట్టుకొంటాం; ఇది మీ అన్నయ్యకు పెట్టేస్తాను. ఎన్నడూ యిలా అడిగేవాడివి కాదే? ఇవాళ అంతా వింతగా ఉంది నీ ప్రవర్తన. ఏం జరిగిందంటే చెప్పవు కదయ్యా, రామయ్యా!"

'అడగక అడగక ఈవేళ అడిగాను! అన్నయ్య ఈవేళే వడ్డ ఒప్పందానికి ఏభై రూపాయలు పట్టుకొచ్చాడు కదా, వదినా! బ్రతికిపోయావ్, నాటకం బయటపడకుండా!' అనుకొన్నాడు లోపల్లోపల, కోపంగా.


సరస్వతి నేతిగిన్నె పట్టుకు నిలబడింది. "కలుపవేం, రామా? అన్నం ముందు కూర్చొని ఆ తపస్సేమిటి, మనసు అంతర్ముఖం చేసి?"

తలెత్తి వదిన ముఖంలోకి చూశాడు అనంత్, నిదానంగా. ఒక నిట్టూర్పు విడిచి, "నిన్న మొన్న వచ్చిన మరిదికి ఈ విషయాలన్నీ ఎందుకు తెలియనివ్వాల-అతడి మనసెందుకు కష్టపెట్టాలని దాచారు మీ రిద్దరూ! సరే కాని, ఈ దౌర్భాగ్యుడు ఏ విధానా బయటపడలేని పాపకూపాన పడిపోతున్నాడని మీకేనాడూ తట్టలేదా, వదినా!" అని అడిగాడు. "మీది సద్భావమే కావచ్చు; కాని, అది నాకు పాపాన్నీ, కళంకాన్నీ మూటగట్టి ఇస్తున్నది."

వెలవెలబోయింది సరస్వతి. అతడు ఏది మనసులో పెట్టుకొని యిలా నిష్ఠూరమాడుతున్నాడో చప్పున బోధపడలేదామెకు. "దేన్ని గురించి ఈ నిష్ఠూరాలు?" అంది ఖిన్నవదనంతో.

"ఇంటికి రాగానే విస్తరినిండా కుంభంతో డేదానివి, ఏనాడూ మీకు ఉన్నదో లేదో నన్న ఆలోచనకూడా నాకు రాకుండా నేర్పుగా నాటకమాడావు! ఎన్నిసార్లు నాకు పెట్టి నువ్వూ, పిల్లలూ ఉపోషాలు ఉన్నారో దైవానికే తెలియాలి, మరి! ఉన్న సొమ్ములేవో కుదువబెట్టారని, అన్నయ్య అప్పులు చేసి, అప్పులు పుట్టనిచోట కొంపలు ముంచే వడ్డీలకూ, వడ్ల ఒప్పందాలకూ తెచ్చి ఇల్లు నడుపుతున్నాడని ఏనాడైనా నాకు తెలియనిచ్చారా? ఓహ్! ఇద్దరూ ఎంత నేర్పరులు? ఎంత నటకులు?"

ఒక్కక్షణం పట్టుపడిన దొంగలా తలవాల్చింది సరస్వతి. వెంటనే ముఖభంగిమలు మార్చి, లేనినవ్వు తెచ్చుకొని ఊరికే నవ్వేస్తూ, "భలేవాడివే! నాటకాలు బూటకాలు ఎందుకు వచ్చాయి? డబ్బు పుష్కలంగా చేతిలో ఆడుతుందని చెప్పనుగాని. ఏనాడూ నీకు పెట్టి మేము ఉపవాసాలు చేసిన రోజు రాలేదు. నేతిగిన్నె పట్టుకొని చెబుతున్నాను!" అంది.



నవ్వొచ్చింది అనంత్‌కు. "నేతిగిన్నె సాక్ష్యం ఎందుకు వచ్చిందిలే, వదినా! నీ మాట అబద్ధమైనా ఆ గిన్నె క్రిందపడి నీ నేరం బయటపెట్టదు; ఆ సత్యకాలాలు పోయాయి."

మౌనంగా భోజనం కానిచ్చి వెళ్ళిపోయాడు అనంత్.

పిల్లలకు అన్నాలు పెట్టేస్తూంటే వచ్చాడు శాస్త్రి. అతడికీ అన్నం పెట్టి అతడి భోజనమయ్యాక తనూ తిని, మడిబట్ట వదిలి, మామూలు చీర కట్టుకొని యివతలికి వచ్చింది సరస్వతి. తాంబూలం వేసుకొంటూంటే చిన్న కొడుకు వచ్చి చెప్పాడు: ''బాబాయ్

"వెళ్లలేదేవ్, అమ్మా! గదిలో ఉన్నాడు."

మణయ్యగారి పాలేరు మసిగాడు వాకిట్లో నిలబడ్డాడు వచ్చి, సరస్వతి కూర్చొన్న గుమ్మానికి ఎదురుగా. ఆ చెట్టంత మనిషి చేతిలో ఆ చిన్నిపలక చూస్తూంటే ఎబ్బెట్టుగా, హాస్యాస్పదంగా తోచి నవ్వుకొంది సరస్వతి.

"ఏరా?"

"పంతులుగారు ఇంట్లో లేరా అమ్మా?"

"ఇంట్లో ఉన్నాడు...వెళ్తాడేమో చెప్పు పో, అంజీ!" కొడుక్కి చెప్పింది.

అంజి తిరిగివచ్చి చెప్పాడు: "బాబాయికి తలనొప్పిగా ఉందిట! ఈ వేళ్ళ రాడట పో."

"అందరూ వచ్చి కూర్చొన్నారు. వెళ్ళిపొమ్మని చెప్పేదా?"

"మరి మీ పంతులుగారికి ఒంట్లో బాగుండలేదటకదా! వెళ్ళమని చెప్పు ఇవాళ్ళకు;" మసిగాడు వెళ్ళిపోయాక సరస్వతి అనంత్ గదిలోకి వచ్చింది.

కణతలు పట్టుకొని పడుకొని ఉన్నాడు అనంత్.

"మీ అన్నయ్య సంసారంమీద అన్ని అబద్ధాలు చెప్పి ఎవరు నీ మనసును కష్టపెట్టారు, రామూ?" సమీపించి అనంత్ నుదుటిమీద సున్నితంగా వేళ్ళతో ఒత్తింది.

వదినచేతిని కొంచెం కోపంగా త్రోసి లేచాడు అనంత్. "నన్నింకా భ్రాంతిలో పెట్టాలని చూడకు!" వంకెకు తగిలించిన లాల్చీజేబునుండి బంగారుగొలుసు తీసి వదినముందు పెట్టాడు.

తెచ్చి పెట్టుకొన్న నవ్వు త్రుటిలో మటుమాయమైపోయి విభ్రాంతి మిళితమైన విచార రేఖలు అలుముకొన్నాయి సరస్వతి ముఖంలో. "నీ దగ్గరికి ఎలా వచ్చింది?" అన్నది తడబడే గొంతుతో.

సాయంకాలం జరిగిన సంఘటన వివరించాడు అనంత్. "చూశావా? ఇంటి విషయాలు నేనేమీ పట్టించుకోనందుకు నలుగురూ నా ముఖంమీద ఎలా అంటున్నారో తెలిసిందా, వదినా?" దుఃఖావేశాలు నిండిన రుద్ధస్వరంతో గొణిగాడు.

సరస్వతి విచారంగా, మందలింపుగా అన్నది: "నువ్వు చేసిన పని సమంజసంగా లేదు, అనంతరామా! ఆ గొలుసును ఇప్పుడు విడిపించుకోకుంటే పోయిందేమి? పేదపిల్లలకోసం ఎత్తిన చందాను ఈ రూపంలో...... ఛీఛీ! నువ్వింత ఛండాలపుపని చేస్తావని ఏనాడూ అనుకోలేదు."

"నిజంగా నేనందుకు చాల క్రుంగిపోతున్నాను వదినా! పదుగురిలోకి వెళ్లాలంటే ముఖం చెల్లడంలేదు; సిగ్గుతో చచ్చిపోతున్నాను."



"మరెందుకు ఆవేశపడ్డావు? నువ్వు చేసినపని ఏమన్నా మంచిదా?"

"కాదు. అప్పటి పరిస్థితి నన్నా విధంగా తొందరపెట్టింది."

"ఈ సంగతి మీ అన్నయ్యకు తెలిస్తే ఎంత క్రుంగిపోతారు?" ఆవేదనగా నిట్టూర్చి అంది: "ఏ ధర్మాత్ముల కారుణ్యంవల్లో జ్ఞానభిక్ష పొందివచ్చావు; ఏవో ఆదర్శాలూ, సేవాభావాలూ హృదయంలో నింపుకొని. నువ్వు తిరిగివచ్చినరోజు మీ అన్నయ్య ఎంత సంతోషించారో, నీ సంస్కారయుతమయిన సదుద్దేశ్యాలు తెలిసినరోజున అంతగా ఆనందపడిపోయారు. నీ ఆదర్శాల సాఫల్యానికి ధనసహాయం చేయగల తాహతు లేకపోయినా, ఈ సంసారంలోని చిక్కులేవీ నిన్ను చుట్టివేయకుండా, నీ మార్గంలో నువ్వు సాగిపోయే శాంతి ఇంటిలో లభ్యమౌతే అంతకంటే తను చేయగల సాయం లేదనుకొన్నారు. కాని, దౌర్భాగ్యదేవత చూపులో చిక్కుకొన్నవాడి ఆలోచనలూ, ఆశలూ ఏవీ సఫలం పొందవు!" సరస్వతి కళ్ళలో అశ్రువులు నిండాయి. "మీ తండ్రిగారు పోయినప్పుడు ఆయనకు పదేళ్ళట! దూరపుబంధువు లెవరో ఆశ్రయమిచ్చారు ఇంట. ఆ ఇల్లాలు మహా పుణ్యాత్మురాలు! ఇంటెడు చాకిరీ ఈయనతో చేయించేదట. గృహస్థు మాత్రం కొంచెం దయార్ద్రహృదయుడట. మంత్రభాగం కొంత నేర్పి పౌరోహిత్యం చేసుకుని బ్రతుకు. పొమ్మన్నారు.

"కలిమి లేకపోయినా, వెనుకా ముందూ ఎవరూ లేకపోయినా, పిల్లవాడు బుద్ధిమంతుడని మా నాన్నకు తెలిసింది. మా నాన్న ఆరుగురు ఆడపిల్లల తండ్రి. ఒకమాదిరి ఉన్నవాడైనా గొప్పసంబంధాలు పట్టుకురాలేకపోయాడు. ఈయనను పిలిచి నన్నిచ్చి పెళ్ళి చేసి, ఇక్కడే ఓ ఎకరంన్నర పొలం కొని ఇచ్చేశారు నాకు. మీ తండ్రిగారు మీ కంటూ మిగిల్చిపోయిన ఆస్తి ఈ ఇల్లు. ఇది అంతా పడిపోయింది. మా నాన్నగారే తిరిగి మరమ్మత్తు చేయించి ఇందులో మమ్ము కాపురం పెట్టించిపోయారు.

"పెళ్ళి అయిన ఏడే పెద్దవాడు రవి పుట్టాడు. ఆ ఏడు పంటకూడా బాగా పండింది. పౌరోహిత్యంవల్ల కూడా నాలుగుడబ్బులు కూడాయి. బోసి మెడతో ఉన్నానని, రెండు తులాలు బంగారం ఖరీదుచేసి, పుస్తెల గొలుసు చేయించివేశారు మెడలో. తిరిగింది అదృష్టచక్రం అన్నారు నలుగురూ. ఇల్లాలు పాదం మంచిది అన్నారు. ఏడాది రెండేళ్ళు ఏ చీకా

కులూ లేకుండా ఆనందంగా గడిచింది. ఆ తరువాత కాన్పులో నేను జబ్బు పడడం, డబ్బు మంచినీళ్ళలా ఖర్చు కావడం, గొలుసు తాకట్టులో పడడం, అప్పులు చేయడం అన్నీ జరిగి పోయాయి. ఏవో ఖర్చులమీద ఖర్చులు, పిల్లలమీద పిల్లలు; దానికితోడు ఏటా పురుగు తగిలి పంటలు పాడై పోవడం. పౌరోహిత్యంవల్ల రాబడి కూడా అంతంతే కావడం—అది మొదలు తిరిగి కోలుకొన్నది లేదు.

"ఈ సంసార పరిస్థితి ఇలా ఉండగా రాత్రివేళల్లో మధ్యమధ్య ఏవో పీడ కలలు వచ్చేవట ఆయనకు. పక్కమీద హఠాత్తుగా లేచికూర్చొని ఉరిపెట్టుకు చచ్చిన తండ్రినీ, పట్టించుకొనే దిక్కు లేక, అన్నంపెట్టేదాత లేక ఆ అయి దేళ్ళ వయసులో ఎక్కడికో వెళ్ళి పోయిన నిన్నూ తలుచుకొని వెక్కిళ్లు పట్టేదాకా ఏడ్చేవారు!


"ఆరునెలల క్రింద ఆరోజు నువ్వు తిరిగివచ్చిననాడు – నేను చెప్పడ మెందుకు? ఆయన తన్మయత్వం నువ్వే చూశావుకదూ?''

ఆ సంయోగ ఘట్టం తలుచు కొంటే ఒకవిధమైన ఉద్వేగంతో అనంత్ నేత్రాలు నీటితో తొణికిస లాడాయి. గురుదేవుల అనుజ్ఞనూ, ఆశీర్వాదాన్నీ పొంది రెండురోజులు ప్రయాణం చేసి, అన్నను వెదుక్కొంటూ వచ్చాడు, ఓ సాయంకాలంవేళ. వీధి అరుగుమీద చిరిచాప వేసుకొని, సద్గ్రంథమేదో పఠిస్తున్నాడు శాస్త్రి. తనలో ముద్రపడిన చిన్ననాటి ఆయన రూపురేఖలు ఆ రూపులో పోల్చుకొని అన్నయ్యా!' అన్నాడు గాద్గదికంగా.

ఒకక్షణం మాత్రం పరిశీలనగా చూశాడు శాస్త్రి. ఆ మరుక్షణం అనంత్ చేతిలో సూటుకేసు క్రింద పడిపోయి, అన్నగారి కౌగిలింతలో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. పావు గంటదాకా ఇద్దరినుండీ మాటలు కర వయ్యాయి. గొంతులో ఏడ్పున్ను అదిమి పట్టి, కళ్ళు మాటిమాటికీ తుడుచు కొంటూ ఒకరినొకరు చూచుకోవ డంతో సరిపోయింది!

"ఈ ఇంటి వాతావరణం ఏ కొంచెం బాధాకరంగా పరిణమించినా నువ్వు ఎక్కడ పలాయనం చిత్తగిస్తావోనని ఆయన భయపడుతూనే ఉన్నారు." భారంగా నిట్టూర్పువిడిచి తిరిగి అంది: "నువ్వు ఒక్కమాట ఇవ్వాలి, అనంత రామా! ఎటువంటి పరిస్థితి ఎదురైనా ఆయనను అన్యాయం చేసిపోకు. చూడు, ఈ విషయాలు నీకు తెలిసి నట్లు కూడా ఆయనకు తెలియనీయకు. చాలా బాధపడిపోతా రాయన. నువ్వు ఈ ఇంటివిషయా లేవీ పట్టించుకో





వలసిన పనిలేదు. నీ ఆశయాలను, ఆదర్శాలను చంపుకోవడం కూడా మా కెంతో దుఃఖంగా పరిణమిస్తుంది."

వదిన ముఖంలోకి నిశ్చలంగా చూస్తూ దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు అనంత్.

"జీవితంలో అడుగుపెట్టిన మానవుడు తొలితప్పు తెలియకనే, అనాలోచితంగానే చేస్తాడేమో? అక్కడికి అతడిని క్షమించవచ్చు. ఆ తప్పును కప్పిపుచ్చుకోవడానికి తప్పుల పరంపర ప్రారంభిస్తాడు. వాడు పరమనీచుడు; దొంగ!

"నీ వదిన చేతిలో చేయివేసి చెప్పు రామా, మరొకసారి అటువంటి నీచానికి పాల్పడనని!"

"వదినా!" సాచిన వదినచేతిలో తన చేతిని ఎత్తి ఉంచాడు. "మాట తప్పను. నా జీవితంలో ఇదొక్కటే తప్పటడుగు!" అన్నాడు ఆర్ద్రంగా.

గబగబా కళ్ళు తుడిచేసుకొని సరస్వతి అంది: "ఆ గొలుసు ఎలా తెచ్చావో అలా పంపెయ్యి; తక్కిన డబ్బు నే నెలగో చూస్తానుగాని."

కృతజ్ఞత నిండిన నేత్రాలు ఆదే పనిగా వర్షిస్తున్నాయి.

మరిదికళ్ళు తన చల్లని చేతుల్తో తుడిచి, తనకు సహజమైన తేటనవ్వు ముఖంలో చిందిస్తూ, గదినుండి వెళ్ళిపోయింది సరస్వతి — 'పాతికేళ్ళు వచ్చాయేగాని పసిమనసే, పాపం!' అనుకొంటూ.

* * *

"అనంత రామశాస్త్రిగారూ! ఇదిగో, మిమ్మల్నే! పనిమీద వెడుతున్నారా?"

చేతులు వెనక్కి పెట్టుకొని, తల వంచుకొని పరధ్యానంగా నడిచి వెడుతున్న అనంత్ ఉలికిపాటుతో తలెత్తాడు, ఆ నడిరోడ్డుమీద కౌముది కమనీయ కంఠస్వరం విని. "ఓ! ఎక్కడికో బయల్దేరినట్లున్నారు?" మృదువుగా, మన్ననగా పలుకరించాడు.

"అలా పంటపొలాలమీది చల్లని గాలులు పీల్చుకొందామని!" మంజులమైన జీరస్వరంలో పలుకుతూనే, మధురంగా నవ్వింది కౌముది.

"ముక్కు పగలకుండా చూచుకో పాపం!" నళినీ నవ్వాడు.

ఆమె చెయ్యి పట్టుకొని నడుస్తున్న ఆమె పెదనాన్న కొడుకు గోపీకృష్ణ 'ఇక పద' అన్నట్లు ముందుకు ఈడుస్తున్నాడు. కౌముదితో సరదాగా షికారుకు బయల్దేరిన నళినీమోహన్కు, దారిమధ్యలో ఆగిపోయి; అతడితో మాట్లాడడం అంత రుచించనట్లుంది.





హిందుస్తాన్ లీవర్ ఉత్పత్తి

Yuva, (Telugu Monthly) June, 1968

…ంబి వెధవలా ఈ శనిగాడు అడ్డమయ్యాడేం' అన్నట్లు చిరాకుగా నిలబడ్డాడు

"పనిమీద వెడుతున్నారా? ఏనేం లేకపోతే మాతో రారాదాండీ? సరదాగా మాట్లాడుకొంటూ…"

మధ్యలోనే వెటకరించాడు నళినీ: "ఆయన దగ్గర సరదామాటలేం ఉంటాయిలెద్దూ! విద్యాదానాలూ, చందాలూ, ప్రజాసేవలూ…పట్టించుకొన్నావంటే జిడ్డులా వదలరు ఇలాంటివారు! ఏవేవో బుద్ధులు గరిపిఓ వెయ్యిన్నూటపదహార్లు విరాళమిమ్మంటారు. నీ పేరు సువర్ణాక్షరాలతో లిఖింపజేస్తామంటారు. అలాంటివాళ్ళ టోపీలో పడబోకు!"

"ఏవండీ? మీ దగ్గరేం టోపీలు కనిపించడంలేదు నాకు! మామయ్యకు కనిపిస్తున్నట్లున్నాయి!" పరిహాసంగా నవ్వి. నళినీవంక చురుగ్గా చూచింది. "నిష్కారణంగా ఒక మనిషిని అవమానించడమంత క్షుద్రత్వం మరొకటి ఉండదు మామయ్యా!''

నళినీ మాటలకు ఒక్కక్షణం ఎరుపుకు తిరిగింది అనంత్ ముఖంలోని రంగు. ప్రయత్నపూర్వకంగా ముఖభంగిమలు మార్చుకొన్నాడు. నిజంగా అతడు పనిమీద వెడుతున్నాడు. నళినీ ప్రవర్తన అలా అసభ్యంగా ఉండకపోతే రాలేకపోతున్నందుకు క్షమార్పణ కోరి వెళ్ళిపోయేవాడు. ఇప్పుడు అలా వెళ్ళిపోవాలనిపించలేదు. ఒక చెంప కొడితే మరొక చెంప అందించు అన్న క్రీస్తుమాటలు అతడి స్వభావానికి రుచించవు! క్షుద్రమూ, బలహీనమూ అయిన నేటి సమాజంలో అది మనిషి బలహీనతగా, మెతకదనంగా పరిగణింపబడుంది. ఒక చెంప కొడితే రెండు చెంపలు వాయించందే వదలకు!

కౌముది ప్రక్కగా వారి ననుసరించి నడుస్తూ "చదువురానివాడు వింతపశువని ఒక మహానుభావుడు వర్ణించాడు. కాని, చదువుకొని పశువుగా ప్రవర్తించేవాడిని ఏకవీ ఎందుకూ పోల్చినట్లు గుర్తురావడంలేదు నాకు. నాకే కవిత్వం వస్తే, ఈ క్షణంలో చదువొచ్చిన పశువు గుణగణాలు వర్ణిస్తూ పంచరత్నాలో, దశరత్నాలో వల్లించిఉందును!"

నళినీ ముఖంలోని రక్తం నల్లగా మాడిపోయింది. పిడికిళ్లు బిగిశాయి. దానికితోడు ప్రత్యర్థి మాటలకు కౌముది ప్రశంసగా హాసించడం చూచి అతడి కోపజ్వాలలు రివ్వున మింటి కెగశాయి.

దారిపొడువునా ఒక్కమ్మాటకూడా మాట్లాడకుండా తలొంచుకొని ఘర్ధ్యానం అభినయిస్తూ నడవసాగాడు.



రైల్వేలు
ఐకమత్యాన్ని, దేశసమైక్యతను అభివృద్ధి చేస్తాయి



davp 68/25

భారత రైల్వేలు
ఇప్పుడు 116 ఏండ్లు పూర్తి చేశాయి

ఊరి అంచున వరిమళ్ళుదాటి రావు గారి మామిడితోపులో ప్రవేశించారు. తోట ఏమంత అహ్లాదంగా లేదు. మొన్న మొన్నటివరకూ కాయలు విరగ కాచాయి చెట్లు. కాయలు పాటున పడ్డాక పళ్ళను దులిపారు. ఒకటి రెండు జాతిచెట్లు మాత్రం కాయలతో ఉన్నాయి. వెనుకటికి ఏ పెద్దలో నిర్మించిన ఓ చిన్న శివాలయం తోట మధ్యలో ఉంది గాని పూజాపునస్కా రాలు అంత గొప్పగా జరుగుతున్నట్లు కనబడదు. ఏ సోమవారమో బ్రాహ్మడు శివలింగంమీద ఓ చెంబెడు నీళ్ళు గుమ్మరించి తోటలో మారేడు చెట్టునుండి రెండుదళాలు తెచ్చి లింగం మీద వేసిపోతాడు. మండపం ఎండు టాకులతో, దుమ్ముతో నిండివుంది. అయినా, సాయంకాలపు నీరెండలతో, పక్షుల కిచకిచసవ్వడులతో, ఎండు టాకుల గలగల ధ్వనులతో ప్రశాం తంగా, హృద్యమంగా ఉంది వాతా వరణం.

మండపం అంచున ఒకచోట దుమ్ము నోటితో ఊది, చేరుమాలుతో తుడిచి "కూర్చోండి ఇక్కడ'' అంటూ తనూ స్థలం పరిశుభ్రపరచుకొని కూర్చొంది కౌముది.

దిక్కులు చూస్తూ నిల్చున్నాడు నళినీ. 'కూర్చోవేం' అని కూడా అనలేదు కౌముది. ఆమె చూపుతున్న నిర్లక్ష్య తిరస్కారాలకు లోలోపల మండిపోయాడు నళినీ. కాని, అనువు గానిచోట అధికులమనరాదు అన్ననీతి తెలుసు అతడికి. మనసులో కష్టమని పించినా పైకి ప్లేటుమార్చి పశ్చా త్తాపం ధ్వనించే గొంతుకతో "మరోలా అనుకోకండి. నా తత్వానికి మీ భావాలు, ఆదర్శాలు నచ్చవు! అంత మాత్రాన పూర్తిగా సంస్కార హీనుడిగా తలచకండి! పోతే మీపై వ్యక్తిగతద్వేషం నాకేంలేదు. ఉండా ల్సిన సందర్భం అసలు వస్తేకదా?... నాకూ కొన్ని ఆదర్శాలు ఉన్నాయి. కౌముది నడగండి. బొత్తిగా బూజు పట్టిన భావాలలో మునిగిపోయిన వాణ్ణీ, సనాతనిష్టునూ కాను. నాకూ ఒకవిధమైన ఆదర్శాలు ఉన్నాయి,'' అన్నాడు నళినీ, కౌముదివంక చూస్తూ, ఆదర్శాలు అన్న మాటను తిరిగి నొక్కి పలుకుతూ.

"మా మామయ్యకు ఉన్న ఆద ర్శాలు నేను చెబుతాను వినండి. విధవముండల మెడలో పుస్తె కట్టడం ఆదర్శమట. ఆడదాన్ని స్వేచ్ఛగా పురుషుల్తో తిరుగనివ్వడం ఆదర్శమట. ఆడపిల్లలను పెద్దచదువులు చదువ నివ్వడం ఆదర్శమట. అంతా ఆడాళ్ళ వైపు వకాల్తా పుచ్చుకొన్నారు!" ఫక్కుమంది కౌముది. "అస్తమానం



నాకు పోరు ఈయనది, అనంత్ బాబూ! చదువుకొన్న దానివి – పునర్వివాహానికి ఎందుకు ప్రయత్నించకూడదూ అని. చదువుకొన్న చదువు సంఘశ్రేయ స్సుకు ఉపయోగపడాలి గాని విప్లవ జ్వాలలు రగిలించడానికి కాదుగా ?'' పరిహాసపూర్వకంగా చెప్పబోయింది గాని, అణచుకోలేని విషాద గాంభీ ర్యాలు ధ్వనించాయి ఆ కంఠంలో.

"నాకు శాస్త్రపరిచయ మంతగా లేదు; మీరు చెప్పండి, అనంత్ బాబూ! నేను చెప్పేది మంచిమాట కాదా? నిండువయసులో వైధవ్యంపొందినస్త్రీ, ఆ వైధవ్యంలోనే కఠోర జీవితం గడపడమే సమాజకళ్యాణ మంటారా? వితంతువుస్త్రీకి సౌభాగ్యాన్ని ప్రసా దించడం గొప్పవిషయం కాదని ఎవ రంటారు?'' మండపానికి సమీపంగా ఓ చెట్టు ఉంది. క్రిందికి వాలివున్న దాని కొమ్మమీద ఎగిరి కూర్చొన్నాడు.

"గొప్ప విషయమే. కాదని ఎవ రంటారు?" సాలోచనగా అన్నాడు అనంత్. "ఒకవిషయం మనం మరిచిపో కూడదు. సనాతన ధర్మాలను, ఆచార వ్యవహారాలను హేళన చేయడం, వాటిని రూపుమాపడమే నేటి నాగరి కతా ఆదర్శ మనుకొంటే, మహోన్నత మైన మన హైందవ సంస్కృతి మంట గలిపినట్లే. స్త్రీకి పునర్వివాహం శాస్త్రంలో చెప్పబడిందో లేదో మన


ఆఖరికి... ఒక క్రొత్త శాస్త్రరీత్యా తయారైన ఫార్ములా




• గులిమిని కరగించును
• రోగములను నివారించును
• బాధను పోగొట్టును
• బాగుగా వినపడేలా చేయును

ధర రు. 2.90 + స్థానిక పన్నులు అదనము

శాస్త్రరీత్యా తయారుచేయబడినది నిషక్ చెవిమందు
ఇంకా యితర చర్మ వ్యాధులకు కూడ పనిచేస్తుంది

విటాల్ మొటిమల క్రీమును తయారుచేయువారు

కొచ్చిన్ ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్
బొంబాయి-26 – కొచ్చిన్-2.
(అందరి కెమిస్టులవద్ద లభించును

డిస్ట్రిబ్యూటర్లు:
మెస్సర్స్ గణపతి & కంపెనీ,
103/104, లింగి చెట్టి స్ట్రీట్,
పోస్ట్ బాక్స్ నెం. 1966, మద్రాసు-1.

కనవసరం. మన సమాజంలో ఏ మానవుడూ దుఃఖజీవితం గడపకూడదని మన మానవతా సిద్ధాంతం చెబుతుంది. అయితే బ్రహ్మచర్యం పవిత్రజీవితమని చెబుతుంది మన ఆధ్యాత్మిక తత్వం. స్త్రీ, పురుషులకు ఏ కారణం వల్ల వియోగం సంభవించినా అప్పటి నుండి పవిత్రమైన బ్రహ్మచర్యాన్ని అనుష్ఠించడం చాలా గొప్పవిషయం.

"చిన్న వయసులో, అందులో సంతానహీనంగా పురుషుడిని కోల్పోయిన స్త్రీ అన్నివిధాలా సంసార బంధనం నుండి విముక్తి పొందినట్లే. అటు ఆధ్యాత్మిక జీవితానికి మెట్లు నిర్మించుకోడానికి, అర్హతావకాశాలు ఉన్నప్పుడు సమాజకళ్యాణానికి పాటుపడడానికి ఆమె ఎంతైనా తగు!

"నిగ్రహశూన్య అయిన స్త్రీ విషయం వేరు. చెడువృత్తిలో దిగి గర్భస్రావాది పాడుపనులు చేసుకోవడం కంటే పునర్వివాహం చేసుకోవడం మంచిది. వెదికి అలాంటి వితంతుస్త్రీ మెడలో మీరు పుస్తె కడితే మీరు గొప్పవారే. మీ ఆదర్శం చాలా గొప్పదే. కాదని ఎవ రంటారు?"

ఈ ఆదర్శవాది అన్నివిధాలా పునర్వివాహాన్ని సమర్థించి, కౌముదికి నచ్చజెపుతాడనిఆసించిన నళినీ 'పాము చావక, కర్ర విరగక' అన్నట్లున్న అనంత్ ధోరణికి మండిపోయాడు.


## ఉదరాంతకి

చంటిపిల్లల సమస్త అనాసలు, లివర్ అండ్ స్లీప్లీన్ వ్యాధులు నివారించి ఆరోగ్యవంతులుగా చేయును.

*  *  *  *

## అమృతసంజీవినీమాత్రలు

గర్భిణీ స్త్రీలకు కలుగు సమస్త వ్యాధులను పోగొట్టి తల్లికి, గర్భస్థ శిశువునకు బలము కలిగించి సుఖప్రసవము, సత్సంతానము కలుగజేయును.

## భుజంగరావ్వైద్యశాల

ప్రొప్రయిటర్సు: 'భిషక్ శిరోమణి' పొన్నాడ పేరయ్య అండ్ సన్సు.
తాళ్ళరేవు, తూర్పుగోదావరిజిల్లా.





ఏ విధమయిన అచ్చుపనులైనను
అతి చక్కగా...
అనుకొన్న గడువులో
మేము చేసి యివ్వగలము

★

మా ముద్రణశాఖకు తోడుగా చిత్రకళాశాఖ, బ్లాకు తయారీశాఖ, లితో-ఆఫ్‌సెట్ సంస్థలు సమకూడి వున్నవి.

★

## ది బి. ఎన్. కె. ప్రెస్
## (ప్రైవేట్) లిమిటెడ్

చందమామ బిల్డింగ్స్
వడపళని :: మదరాసు-26
ఫోన్: 83851—4 లైన్లు

'నువ్వా, నీ చచ్చుఆదర్శాలూ! బ్రాహ్మణత్వం పోనిచ్చావు కాదు. ఆధ్యాత్మికమూ, ఆత్మనిగ్రహమూ, నీ బొంద!' రోషంగా తిట్టుకొన్నాడు.

చిరచిరలాడిపోతున్న నళినీ ముఖ వైఖరి గమనించి లోలోన నవ్వుకొన్నాడు అనంత్. అతడు కౌముది మీద కన్ను వేసినట్లు తెలిసిపోతూనే ఉంది!

గోపీకృష్ణ నళినీ కాలు పట్టి క్రిందికి లాగాడు, మామిడికాయలురాలగొట్టి ఇద్దువు రమ్మంటూ.

కౌముది ముఖంలో మారిన రంగులు చూచి కించిత్ విస్మయానికి లోనయ్యాడు అనంత్. సిగ్గుతో ఎర్రబడిన ముఖాన్ని ప్రక్కకు త్రిప్పుకొని 'తప్పుగా చెప్పానా? నా ఊహాకు తోచినమాట చెప్పాను;' కళ్ళు వాల్చింది!

కౌముది నిగ్రహాన్ని పరీక్షించేమాట విసిరానని ఆమె ముఖం చూచాకగాని తెలిసింది కాదు. 'ఓహ్! ఎంత తొందరపడ్డాను?' నొచ్చుకొన్నాడు.

ఈ ఏకాంతం చాలా ఇబ్బందిగా తోచింది కౌముదీ అనంత్‌లకు. అతడి వంక సూటిగా చూడాలంటే ఏమిటో లజ్జగా తోచింది కౌముదికి. ఆమెతో సంభాషణ సాగించాలంటే ఎందుకో జంకుగా వుంది అనంత్‌కు. 'ఆమెకు పునర్వివాహం చేసుకోవాలన్న తలపు మనసులో ఉందేమో? నా అభి


పిల్లి మార్కు
పాన్ మసాలా పౌడర్

వక్క, తమలపాకులతో, ఇది ఒక చిటికెడు వేసుకుంటే పలుకులు, లవంగములు వగైరా ఏవి అవసరముండదు. అన్ని సుగంధ పదార్థములు దీనిలోనే ఉన్నవి. మీ తాంబూలమునకు సువాసన, రుచి ఇచ్చును.




సాంపిలు వివరమునకు వ్రాయండి:
అరోమాటిక్ కెమికల్ అండ్ ఆయిల్ కంపెని,
7-A. సింగన్న నాయిక్ వీధి. మద్రాసు-1
P.B. నం. 1267 ఫోన్ - 22099